# మల్లి

పనిపిల్లని చూసి పెట్టమని పదిరోజులుగా మా ఫ్యూన్ ఓబులేసుని బతిమాలుకుంటున్నా. ఈ రోజు ఏ మూడ్‌లో ఉన్నాడో ఏమో "సాయంత్రం ఏడెనిమిది మద్దెలో పిల్సుకోనొస్తా సారూ" అన్నాడు.

ప్రమోషన్ మీద విజయవాడకు బదిలీ అయిన క్షణం నుంచీ నాకు తిప్పలు తప్పటం లేదు. పిల్లల చదువుల దృష్ట్యా హైద్రాబాద్ నుండి ఫ్యామిలీని మార్చటం వీలుకాదు కాబట్టి నేనొక్కణ్ణే పెట్టే బేడా సర్దుకుని – వాటితో పాటు వంట గిన్నెలూ – పొడులూ – పచ్చళ్ళూ పెట్టుకుని ప్రయాణమైనా. ప్రమోషన్ వచ్చినందుకు సంబరపడాలో – బదిలీ మీద పెళ్ళాం పిల్లలకు దూరంగా పరాయి వూరికి విసిరేయబడినందుకు బాధపడాలో అర్థంకాని పరిస్థితి . . .

"చాల్లెండి బడాయి.. విసిరేయబడటమా పాడా – మన విజయవాడేగా – కూతేస్తే వినబడేంత దూరం" అంటూ హైద్రాబాద్‌లో స్టెనోగా పనిచేస్తున్న విజయవాడ అమ్మాయి రాజేశ్వరి వూరడించినా – సుళ్ళు తిరుగుతూ దిగులు . . .

అటువంటి సమయంలో నాకు ధైర్యం చెప్పి, అన్ని విధాలా తోడుగా నిల్చింది స్టాలిన్ బాబు. లీలామహల్ థియేటర్ యజమానైనా – నిగర్వి, స్నేహశీలి.

కొన్నేళ్ళక్రితం ఏదో పనిమీద మా ఆఫీసుకొచ్చినపుడు పరిచయం. విజయవాడలో హోటల్లో రూం తీసుకుని రెండ్రోజులు అద్దె గదుల కోసం వెతికీ వెతికీ ఆ సాయంత్రం పల్కరిద్దామని స్టాలిన్ దగ్గర కెళ్ళా. ఆ క్షణం నుంచీ నన్ను వదిల్తే ఒట్టు. అతని కార్లోనే వూరంతా అద్దె ఇళ్ళ కోసం తిరగటం – వాళ్ళింట్లోనే భోజనం . . . నేను మొహమాటంతో సగమైపోయా.

ఎన్ని ఇళ్ళు చూసినా స్టాలిన్‌కి ఒక్కటీ నచ్చలేదు. "మీరు ఆఫీసర్ కదా. ఇవేవీ మీకు తగినట్లు లేవు" అన్నాడు. ఓ వారం తిరిగాక "మరిచేపోయాను. మా థియేటర్ వెనుక గెస్ట్‌హౌజ్ ఖాళీగా ఉంది. మీకు నచ్చుతుందేమో చూడండి" అన్నాడు.

లీలామహల్ సినిమా హాలు వెనుక ఉన్న ఆ యింటిని చూశాను. అద్భుతంగా వుంది.

బెడ్రూంకి అటాచ్డ్ బాత్‌రూం . . . వేడినీళ్ళ కోసం గీజర్ - పెద్ద హాలు... బెడ్రూంలో, హాల్లో ఎయిర్‌కండిషన్ మెషిన్లు, హాలుని ఆనుకుని విశాలమైన బాల్కనీ, దానిమీద ఉదారంగా వాలుతున్న వేపచెట్టు నీడ . . . వెంటనే మకాం అందులోకి మార్చేశాను.

అతని పరపతి మీద గ్యాస్ సిలిండర్ ఇప్పించాడు. కిచెన్ కోసం వేరే గది లేదు కాబట్టి హాల్లోని ఓ మూలని కిచెన్ కింద మార్చేసి - వంట సామానంతా సర్దేశా. నాకు హోటల్ భోజనం పడదు. అందునా విజయవాడ హోటళ్ళలోని కారాల్ని అస్సలు భరించలేను. అయినా నా ఒక్కడి భోజనం వండుకోడం ఏం కష్టమని . . . ఓ కుక్కర్‌లో అన్నం, మరో కుక్కర్‌లో పప్పు పెట్టేస్తే చాలు - అరగంటలో అన్నీ రెడీ. వేడి వేడి అన్నం - పోపేసిన టమేటా పప్పు - ఇంటి నుండి తెచ్చుకున్న పచ్చళ్ళూ - నెయ్యీ . . . ఎన్ని వందలు పెట్టినా - ఎంత గొప్ప హోటల్ కెళ్ళినా ఇంత చక్కటి, రుచికరమైన భోజనం దొరుకుతుందా?

అన్నీ బాగానే ఉన్నా అసలు సమస్య పనిమనిషి దగ్గరొచ్చింది. వంట చేసుకోటం వరకైతే బాగానే ఉంది కానీ అంట్లు తోమటం మాత్రం ఇబ్బందనిపించి, పనిమనిషి వేటలో పడ్డాం. విజయవాడలో పనిమనుషులకు కొదవేం లేదు. కానీ ఎంతిస్తానని బతిమాలుకున్నా నాకు మాత్రం ఒక్క పనిపిల్లా దొరకటం లేదు. ఓబులేశుని కారణమడిగా. "ఇల్లల్లో సేయడానికి ఎవురైనా వత్తారయ్యా-ఇది గెస్టోసు కదా - అందునా సినిమా టాకీసు లోపల ఉందాయె - మగోల్లు శానామంది తిరగతా వుంటారాయె. అందుకని పనికిరాడానికి బయపడ్తున్నారు సారూ" అన్నాడు.

"అంతేనా - ఇంకా ఏమైనా కారణాలున్నాయా?" అనుమానం తీరక అడిగాను.

కొద్దిసేపు నీళ్ళు నమిలి - చేతులు నలుపుకుని నంగి నంగిగా చెప్పాడు - "ఎవురైనా ఆడకూతురు ఇల్లల్లో ఉంటే ఇంత ఆలోసించరయ్యా - తమరొక్కరే కదా ఉండేది అందుకనీ . . ."

నా అనుమానం నిజమేనన్మాట - పని పిల్లకోసమని కాండక్ట్ సర్టిఫికేట్ ఎక్కడి నుంచి పట్రానూ? "నేను చాలా మంచోణ్ణి ఓబులేశూ - నీకు తెల్సుకదా - పర్‌ఫెక్ట్ జెంటిల్మాన్‌ని" అందామనుకుని విరమించుకున్నా. మన కేరెక్టర్ గురించి మనమే చెప్పుకోవాల్సి రావటం - అందునా మన దగ్గర పనిచేసే ప్యూన్ దగ్గర చెప్పుకోవాల్సిన అగత్యం ఏర్పడటం దారుణమనిపించింది. అధవా నేనలా చెప్పినా, "మీరెలాటోళ్ళో నాకు తెల్సు సారూ - పని పిల్లకు తెలీదుగా" అంటాడనిపించింది.

"నాకు కుర్రపిల్లలే కావాలని నీకు చెప్పానా? పని చేయడానికి ఓపికున్న ముసల్దాన్ని

తెచ్చినా పర్లేదు. నాక్కావాల్సింది కసువూడ్చి, అంట్లు తోమిపెట్టి, కింది నుంచి రెండు బిందెల మంచినీళ్ళు తెచ్చివ్వగల పని మనిషి" అన్నాను ఉక్రోషంగా.

నాక్కొద్దిగా కోపం వచ్చిందని ఓబులేశుకి అర్థమైనట్టుంది. మరోమాట మాట్లాడకుండా "మరో వారం గడువులో పనిమడిసిని కుదిర్సిపెడ్తా సారూ" అని వెళ్ళిపోయాడు.

ఈరోజతనికి దయ కలిగినట్లుంది.

బాల్కనీలో ఈజీ ఛెయిర్ వేసుకుని – వేపచెట్టు గాలిని ఆస్వాదిస్తూ – ఓబులేశుకోసం ఎదురుచూస్తూ కూచున్నా. లీలా మహల్లో తెలుగులోకి డబ్ చేసిన ఇంగ్లీషు సినిమా 'ఎనకొండ' ఆడుతోంది. మొదటి ఆట ఇంటర్వెల్ సమయం – సిగరెట్లు కాల్చుకుంటూ బాతాఖానీ కొట్టుకుంటున్న కుర్రోళ్ళని గమనిస్తూ వాళ్ళ మధ్యలోంచి దారి చేసుకుంటూ కదుల్తున్న ఓబులేశుని చూశాను. అతని వెనకే నడుస్తున్న అమ్మాయి . . . సుమారు ఎత్తుగా ఉండి పుష్టిగా కనిపించింది. మెట్లెక్కుతున్నప్పుడు ఆ అమ్మాయి నింపాదిగా ఎక్కడం గమనించి చాలా నెమ్మదైన పిల్లనుకున్నాను.

ఓబులేశు నా ఎదురుగా నిలబడి, "సారూ! దీని పేరు మల్లి. అమ్మ లేదు. అయ్య రిచ్చా తొక్కుతాడు. ఏమేం పన్లు సేయాలో సెప్పి తీసుకొచ్చా. మీరాఫీసుకెల్లే లోపల వచ్చి పనంతా సేస్కొనెల్తది. మల్లా పొద్దుగూకాకొచ్చి మీ బోయనాలయ్యానాక వెల్తది. నెలకు ఐదొందలట" గుక్క తిప్పుకోకుండా ఏకరువు పెట్టాడు.

అప్పుడు గమనించా ఆ అమ్మాయి వైపు. కాటుక దిద్దిన వెడల్పాటి కళ్ళు – తీర్చిదిద్దినట్టు కాకున్నా చక్కటి ముక్కు– నిండైన గుండ్రటి పెదాలు – చామనఛాయతో నిగారింపైన వళ్ళు . . . వీటన్నిటితోపాటు ఉబ్బెత్తుగా కన్పిస్తున్న పొట్ట.

"నీ పేరేంటీ" – ఏదో ఒకటి మాట్లాడాలని అడిగాను. తీరా అడిగాక గుర్తొచ్చింది ఇందాక ఓబులేశు చెప్పిన విషయం.

"మల్లీశ్వరి" అందా అమ్మాయి సూటిగా నా కళ్ళల్లోకి చూస్తూ. చాలా ధైర్యం గల పిల్ల అనుకున్నాను. ఇంకా నయం "ఓబులేశు సెప్పాడుగా మల్లని – మల్లా అడుగుతావేం" అని నిలదీయలేదు.

"ఎన్నో నెల?" అన్నాను వేపచెట్టు కొమ్మల్లోకి చూస్తూ.

"ఆరు"

ఓబులేశుకి నా మనసులో ఏముందో అర్థమయి, "ఈ పిల్లని గేటు బైటికి వదిలొస్తా సారూ. రేపుదయం వస్తది. నేను మల్లొచ్చి ఇవరంగా సెప్తా" అంటూ వేగంగా మల్లిని తీసుకుని వెళ్ళిపోయాడు.

నాకు ఓబులేశు మీద పీకల్దాకా కోపం వచ్చింది. మల్లొస్తానన్నాడుగా. రాగానే ఈ వేపచెట్టు కొమ్మకు వేలాడదీయాలన్నంత కోపం . . . పనిమనిషిని చూసిపెట్టమంటే మరో మూణ్ణెల్లలో అమ్మ కాబోతున్న అమ్మాయిని పిల్చుకొచ్చాడు. బుద్ధుందా అసలు? నాదసలే సుతిమెత్తని మనసు. నాకా అమ్మాయి పన్లు చేయటం అటుంచి నేనే అన్ని పన్లూ చేసుకుని ఐదొందల జీతం నెల తిరగ్గానే ఆమె చేతిలో పెడ్తానేమో! అంట్లు తోమడం సరే – ఈ మెట్లపైనుంచి నీళ్ళెలా మోస్తుంది? పురుడొస్తే మరో పనిమనిషిని వెతుక్కోవాల్సిందేగా . . .

ఆలోచనల్లోనే ఓబులేశు వచ్చాడు.

“అసలేమిటీ నీ ఉద్దేశ్యం? ఆర్నెల్ల కడుపుతో ఉన్న పిల్లను తెచ్చి . . .” నేను మాట పూర్తి చేయకముందే, “శానా కోపంగా ఉందా సారూ – నాకు తెలుసు – బానంత కడుపేస్కుని పనెట్లా సేస్తాదని కదా . . . కూటికి లేని పేదోల్లకు పని సేయకుండా పూట గడవదు. మల్లి మంచి పిల్ల. మీరు ఉత్తినే డబ్బులిస్తానన్నా తీస్కోదు. పని సేస్తాది. మీకు పనిమడిసి అవుసరం కన్నా మల్లికి మీ అసోటి అయ్య అవుసరం ఎక్కువుందనిపించి తెచ్చినా. దానికి ఎక్కువ శముండదు. పూటకింత తిండి దొరుకుద్ది. నా మాటినుకోండి. దానికి పురుడొచ్చేలోపల మరో మడిసిని సూసిపెడ్తా. అందాకా కాదనకండి. మీకు పున్నెమొస్తది. తల్లిలేని పిల్ల” అన్నాడు చేతులు జోడిస్తూ.

‘తల్లిలేని పిల్లనా – నా బొంద – తల్లి కాబోతున్న పిల్ల’ అందామనుకుని ఓబులేశు దీనంగా పెట్టిన మొహం చూసి మానుకున్నా. ఉబికిన పొట్ట చూసిన కంగారులో గమనించలేదు కానీ మల్లికి పదిహేను పదహారేళ్ళకు మించి వయసుండదు.

“మరి మంచినీళ్ళో . . . మోయగలదా?” అన్నాను. ఈ కారణం చూపైనా వద్దని చెప్దామని . . .

“మంచినీళ్ళే కదా సారూ. రెండ్రోజులకోపాలి వచ్చేది. నేను సేస్తాలెండి. మీకు నీల్లు మోసాకే ఆఫీసుకెల్తా” అన్నాడు. ఆ మాటతో మల్లి నా దగ్గర పనిమనిషిగా స్థిరపడింది.

అన్నం వండినా – పప్పు చేసినా –కూర చేసినా ఇద్దరికి సరిపడా చేయడం –నేను తినగా మిగిలింది మల్లికి పెట్టడం అలవాటు చేసుకున్నాను. కడుపుతో ఉన్న పిల్ల కదా . . . ఇక్కడే కూచుని తినమంటే వినేది కాదు. ఇంటికి పట్టుకు పోయేది. మొగుడంటే ప్రాణమనుకుంటా. తనకొక్కదానికే సరిపడా ఉన్నా సగం భర్తకు పెట్టి సగమే తింటుందేమో . . . మొగుడి గురించి వివరాలడుగుదామంటే ముభావంగా తన పని తను చేసుకుపోవటం తప్ప మల్లి ఎక్కువ మాట్లాడేది కాదు.

ఓరోజు ఓబులేశునడిగా. "మల్లి ఎక్కువగా మాట్లాడదా? నిశ్శబ్దంగా పనిచేసుకుపోతుంది– పల్కరించినా పొడిగా సమాధానం చెప్పి తప్పుకుంటుంది తప్ప మరో మాట మాట్లాడదు."

"మల్లి మాటల పుట్ట సారూ! గలగలా మాటాడందే ఛనం ఉండ్లేదు."

"మరి నా దగ్గర పలుకే బంగారంలా చేస్తుందే"

"మీరు పెద్దాపీసరు కదా సారూ. నేనే సెప్పినా – మాట పొల్లు పోతుందని నోటికి తాలం కప్ప బిగించమని"

"అడగటం మర్చిపోయాను – మల్లి పెనిమిటి ఏం పని చేస్తాడూ?"

ఓబులేశు ఉదాసీనంగా మారిపోయాడు. "మల్లి మొగుడు దాన్నొగ్గేసి ఎటో ఎల్లిపోయాడు సారూ. అయినా దాని పిచ్చిగాని పోలీసులకు సెప్తే కాపురాలు సక్కబడ్తాయా? నేనెంత నెత్తీనోరు బాదుకుని సెప్పినా దాని తల కెక్కలా. సినిమాలు సూసి అందులో ఈరోయిన్ సేసినట్టు సేయడానికి పేదోల్లకు కుదుర్తుందా సారూ"

నాలో ఉత్సుకత. "అసలేం జరిగిందో వివరంగా చెప్పు" అన్నాను.

"మల్లి పద్నాలుగేల్లకే పేమలో పడింది. ఇజీవాడలో ఓ పూట కూడైనా మానుకుంతారు కానీ సినీమాల కెల్లటం మాత్తరం మానుకోరు. సినిమావోల్లకు రాజపోసకులు మావోల్లే సారూ. వాటి పెబావం కాకపోతే పద్నాలుగేల్ల పచ్చి పిందెకి పేమేంటి? మల్లి వోల్లు ఏలూరుకాల్వ లాకుల దగ్గర గుడిశెల్లో ఉంటారు. ఆ కుర్రాడు మా ఇంటి దగ్గరోడే – బేవార్సు నాకొడుకు – బీడీలు కాల్సటం, జోబీలో నాల్రూపాలుంటే సినీమా సూట్టం . . . అదే వాడు సేసే పని. ఇద్దరికీ ఎలా కలిసిందో ఏమో పేమలో పడ్డారు. ఇలా అనేకంటే మల్లి పేమలో పడిందంటే శానా రైటుగా ఉంటది.

దానికి ఆడంటే పిచ్చి పేమ. తీరా కడుపొచ్చాక పెల్లి సేస్కొమంటే ఈలు కాదన్నాడు. మేమందరం సెప్పి సూసాం. ఇన్లే. 'అదే సరదాపడి నా యంట పడిన్ది. దానికి కడుపొత్తే నేనేం సేయను? నేను మగాన్ని. లచ్చమందితో తిరగతా. నాకు నస్తేనే మనువాడతా' అన్నాడు. ఆడి బుద్ది నాకు తెల్సు. ఆ ఎదవ నాకొడుక్కి కట్నం పైసలు కావాల.

మల్లి గుడిసెలో ఏడుత్తా కూసుంటుందనుకున్నా. లేదు సారూ. అది సివంగి పిల్ల. ఓరోజు పొద్దుగూకేటేల ఆడివద్ద కొచ్చింది. ఆడి స్కాక్కా పట్టుకుని గుంజుకుంటా, ఈడ్సుకుంటా పోలీసుల్కాడికి లాక్కెల్లింది. నాకు బయమేసి నేన్కూ తోడెల్లా. ఆడ్ని వదలవే అంటే ఇనదు. ఈడు నన్ను మనువెలా ఆడడో సూస్తా అంది. అక్కడంతా రచ్చ . . . ఆడు కడుపు సేసి పెల్లికి పైసలడ్గుతున్నాడని సెప్పింది. యస్సై ఆడ్ని నాలుగు పీకి 'పెల్లి సేస్కుంటావా బొక్కలో

తోయమంటావా' అని బెదరగొట్టి – టేషన్‌కి ఆల్ల పెద్దాల్లని పిలిపించి పెల్లి సేశాడు. మా పేటలో అందరం దాని గుండె దయిర్యానికి నోటి మీద వేలేస్కున్నాం.

పెల్లయితే సేసారుగాని సారూ కాపురం సేయించలేరుగా. ఆడు నాలుగు నెల్లు అలా అలా ఉండి సెప్పా పెట్టకుండా ఎటో ఎల్లిపోయాడు. ఇపుడది దాంతోపాటు దాని బిడ్డని కూడా పోసించుకోవాల" అన్నాడు.

మల్లి వాణ్ణి చొక్కా పట్టుకుని పోలీసుల దగ్గరకు లాక్కుపోయి నిల్చోబెట్టిందని ఓబులేశు చెప్పినపుడు నాకు భలే ముచ్చటేసింది. కానీ వాడు వదిలి పారిపోయాడని విన్నాక బాధనిపించింది.

మల్లి పెళ్ళి విషయం విన్నాక నాకా అమ్మాయంటే కుతూహలం పెరిగింది. అప్పటి నుండీ మెల్లగా మాటలు కలపటం ప్రారంభించాను. మొదట్లో కొద్దిగా పొడిగా మాట్లాడినా తర్వాత్తర్వాత చనువుగా మాట్లాడటం అలవాటైంది.

"అతడెక్కడున్నాడో తెలీదు. వస్తాడో రాడో తెలీదు. మరి బాబునో పాపనో కన్నాక ఏం చేద్దామనుకుంటున్నావు?" అని అడిగానోసారి.

"ఆడెక్కడికి పోతాడయ్యా – నన్నొగ్గేసి ఆడుండలేడు. ఆడికి నేనంటే పేనం. ఇసేకపట్నం దగ్గరున్నాడని మావోల్లు కబురు మోసుకొచ్చారు. మా సుట్టాలందరికీ సెప్పుంచా. ఆడు కన్పీయటం ఆలీసెం . . . తెచ్చి నా కాల్ల కాడ పడేస్తరు" అంది.

ఆ అమ్మాయిది అమాయకత్వమో – ప్రేమించిన వ్యక్తి మీదున్న అనంతమైన విశ్వాసమో లేక మూర్ఖత్వమో నా కర్థం కాలేదు.

"నువ్వు బిడ్డను కనబోతున్నావని తెలిసికూడా నిన్నొదిలేసి పోయినోడు మళ్ళా వస్తాడనుకోను. అతని కోసం ఎదురుచూడ్డం కంటే ఇక రాడనుకుని నీ జీవితాన్ని దానికనుగుణంగా మల్చుకోటం మేలు" అన్నాను.

"లేదయ్యా! నా నమ్మకం నిజమౌతది. ఆడు ఎర్రోడయ్యా. బెదురుగొడ్డు. నేను పోలీసుల్కాడికి లాక్కెల్లానని అలిగి ఎటో పోయాడు కానీ నా మీద పేమ లేక కాదు. ఆడొస్తాడు. మీరు సూస్తుండండి. మీకాడికి లాక్కొచ్చి పరిసయం సేస్తా" అంది నవ్వుతూ.

నవ్వినపుడు మల్లిమొహం మల్లెపువ్వులా విచ్చుకుంది.

వాడు తిరిగిరావాలని –మల్లి నమ్మకం వమ్ము కాకూడదని మనసారా కోరుకున్నా.

పురుడింక వారం రోజుల్లో వస్తుందనగా తనే వాళ్ళింటి దగ్గరుండే మరో అమ్మాయిని మాట్లాడి పెట్టింది.

"అయ్య శానా మంచోరు. నేను తిరిగి పన్లోకొచ్చేవరకూ బాగా సూసుకోయే" అని మరీ మరీ ఆ పిల్లకు చెప్పి, "పెసవం ఐనాక ఈలైనంత తొరగా వచ్చేత్తానయ్యా" అంటూ వీడ్కోలు తీసుకుంది. మల్లి చేతిలో కొంత డబ్బు పెట్టి "ఆరోగ్యం జాగ్రత్త – నీకెప్పుడు ఏ అవసరం వచ్చినా ఈ అమ్మాయి ద్వారా కబురు పెట్టు. నాకు చాతనైనంత సాయం చేస్తాను" అన్నాను.

మల్లి కళ్ళలో నీళ్ళు . . . "మా అయ్య తర్వాత అంత పేమగా సూస్కుంది మీరేనయ్యా" అంది.

వారం దాటాక మల్లికి పురుడొచ్చిందనీ, ఆడపిల్ల పుట్టిందనీ పనిపిల్ల కబురు మోసుకొచ్చింది.

మల్లిని చూసొద్దామని ఓబులేశుతో చెప్పినపుడు, "సారూ!మా గుడిశెల్లోకి మీ అసొంటి గొప్పోల్లు రాలేరు. నేను మీ తరపున మల్లికి సెప్తాలెండి" అన్నాడు. నేనే పట్టుబట్టి ఓబులేశుని తోడుతీస్కొని మల్లిని చూడ్డానికెళ్ళా. తనొక్కతే ఉందా సమయంలో. వాళ్ళ నాన్న రిక్షా వేసుకుని వెళ్ళాడట. నన్ను చూసి చాలా హడావిడి చేసింది. "కురిసీ తెస్తానయ్యా" అంటూ చెప్తున్నా వినకుండా బైటికెళ్ళింది. తిరిగొచ్చాక, "నువ్వు బాలింతరాలివి. ఇలా బైటికెళ్ళిపోతే ఎలా" అంటే, "పేదోల్లం. ఇయన్నీ ఆలోసిస్తూ కూసుంటే కూడెట్టా వత్తదయ్యా" అంది.

నెల తిరుక్కుండానే పన్లోకొచ్చింది. ఓబులేశుతో "మరికొన్ని రోజులు విశ్రాంతి తీసుకో వచ్చుగా" అన్నాను.

"మీ కర్దం కాలేదా సారూ! పన్లోకొస్తే దానికి కధుపు నిండా కూడు దొరుకుద్ది. పిల్లదానికి పాలకు కరువుండదు. దాని కర్సుసుకు పదో పరకో అయ్యగారిత్తారాయె. అందుకని లగెత్తుకొచ్చింది." అన్నాడతను.

పిల్లను ఇంటి దగ్గరే వదిలి వచ్చేది. పక్కింటి అమ్మాయి చూస్కుంటుందని చెప్పింది. పిల్లకు ఆరో నెల వచ్చాక పన్లోకొస్తూ దాన్నీ ఎత్తుకొచ్చేది. హాల్లో వదిలేస్తే దానిపాటికది కాళ్ళూ, చేతులూ యధేచ్ఛగా ఆడిస్తూ హాయిగా ఆడుకునేది.

ఓరోజు ఉదయాన్నే మాములుకంటే గంట ముందే వచ్చింది మల్లి. ఉదయిస్తున్న సూర్యబింబంలా వెలుగుతోందామె మొహం.

"అయ్యా! నేను సెప్పలేదా ఆడుతప్పకుండా వొత్తాడని. నా నమ్మకం నిజమొద్దని. ఇజీనగరంలో ఉండంట. మావోల్లు పిల్సుకు రాడానికెళ్ళారు. మా అయ్యతోపాటు ఓబులేశు బాబాయి కూడా ఎల్లాడు" అంది. మల్లిని అంత సంతోషంగా చూడలేదెప్పుడూ . . . మనస్ఫూర్తిగా సంతోషపడ్డా.

మరునాటి నుంచీ మొగుడి గురించి వసపిట్టలా వాగడమే . . . ఫుల్‌స్టాప్‌లూ, కామాలు

లేకుండా గంటల తరబడి అతని గురించే కబుర్లు . . . "ఆడా ఇజీనగరం నీల్లు పడక బక్కగా, జండా కొయ్యలాగైనాడు. తిండీ తిప్పల్లేక ఎలాగైపోనాడో? ఆడ్ని సూస్తే కడుపు తరుక్కుపోతుందయ్యా. సినేమా ఈరోలా గుండేవోడు. మల్లీశ్వరి సినేమాలో ఎన్టీవోడిలా పొడవాటి గిరజాల జుట్టూ, వెడల్పాటి మొకం, కోరమీసం – సూట్టానికి ఏయి కల్లు సాలేవి కావు. అయ్య ఆడిక్కూడా రిచ్చా ఇప్పిత్తానంటే నేనే వద్దన్నా. రెండు మూన్నెల్లయినా ఆడికి మంచి తిండి పెట్టి, సుకంగా ఉంచితేగానీ మల్లా మడిసి కాలేడు" అంది.

"మీ వద్దకు తెద్దామనే ఉందయ్యా. కానీ ఆడు సిగ్గుపడ్తున్నాడు. మీరు తిడతారని ఆడి బయం. రేపెలాగూ ఆదోరమే కదా. పొద్దుటేల పిల్సుకొత్తా. ఆడ్నేమీ అనమాకండయ్యా. బాదపడతాడు. నేనది సూళ్లేను. ఆడు మంచోడేనయ్యా. ఏది మంచో ఏదిసెడో తెలీని అమాయకుడు. ఆడ్ని నేనెపుడో సెమించేశా. మీరూ ఆడి మనసుకు దెబ్బ తగిలేలా ఏమీ అనకండయ్యా. మల్లిని బాగా సూస్కోరా అనండి. సాలు. ఆడ్ని గ్యానంతో బతకమని ఆసీరెదించండి. సాలు" అందో రోజు.

మల్లికి అతని మీదున్న ప్రేమకు చాలా ముచ్చటేసింది. అంత గొప్ప ప్రేమను పొందిన ఆమె భర్త అదృష్టవంతుడు. అతన్ని తప్పకుండా చూడాలన్న కుతూహలం నాలో....

మరునాడు మల్లి అతన్ని పిల్చుకొచ్చింది. "అయ్య శానా మంచోరు. నువ్వు లేకుండా పోయినా ఇన్ని నెల్లూ నాకూ,. నీ బిడ్డకూ కడుపు కింత కూడు దొరికిందంటే ఈ అయ్య సలవే" అంటూ అతనితో కల్సి నా కాళ్ళకు మొక్కింది.

నేనెక్కడ తొందరపడి అతన్ని తిడ్తానోనని అతని కూడా కూడా తిరిగింది. అవకాశం దొరికినపుడల్లా, 'ఏమీ అనకండి' అంటూ సైగలు చేసింది. నేనింత చదువు చదివినా, అంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా అతనితో ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో నాకు తెలీదన్నట్లు మల్లి నాకు పాఠం చెప్పటం గుర్చొచ్చి, "మల్లి మంచి అమ్మాయి. నువ్వంటే ప్రాణం. అంతగా ప్రేమించే భార్య దొరకటం నీ అదృష్టం. మల్లిని బాగా చూస్కో" అన్నాను.

మల్లి చెప్పమన్న మాట కాకుండా మరో మూడు వాక్యాలు ఎక్కువగా మాట్లాడినందుకు మల్లి ఏమంటుందోనని ఆ అమ్మాయి వైపు చూశాను. సంతృప్తిగా, హాయిగా నవ్వుతూ కన్పించింది. సంతోషమేనా అన్నట్లు కళ్ళెగరేశాను. చాలా సంతోషం అన్నట్లు తనూ కళ్ళు తిప్పింది.

నేను ట్రాన్స్‌ఫర్ మీద విజయవాడ వచ్చి ఓ సంవత్సరం పూర్తవబోతున్న దృష్ట్యా మరలా హైద్రాబాద్‌కు మార్పించుకునే ప్రయత్నాల్లో పడ్డాను.

మల్లి మరలా కడుపుతో ఉంది. మూడో నెల . . . "ఈసారి మగపిల్లాన్ని కనిస్తానయ్యా.

ఆడికి మగపిల్లలమీద శానా బెమ. ఆడి కొడుకే ఆడెక్కడెకీ పోకుండా కట్టడి సేస్కుంటాడు" అంది ఉదారంగా పర్చుకునే వెన్నెల్లా నవ్వుతూ.

మల్లి నాతో అలా అన్న వారానికే ఆమె భర్త ఇల్లొదిలేసి మరలా పరారైనాడు. మల్లి ఓబులేశుని తోడు తీస్కెళ్ళి పోలీసులకి కంప్లెయింట్ ఇచ్చొచ్చింది.

గలగలా మాట్లాడే మల్లి కొన్ని రోజులు మూగపోయింది. నేను సముదాయించాను.

"ఇప్పటికైనా వాడెలాంటివాడో అర్థం చేసుకో. నీకు తగిన భర్తకాడు. మీలో మారు మనువులుంటాయని నువ్వోసారి చెప్పావుగా. మంచి కుర్రాణ్ణి చూసి పెళ్ళి చేస్కో. నీ జీవితం, నీ పిల్లల జీవితం బాగుపడ్తుంది" అంటూ నచ్చజెప్పటానికి ప్రయత్నించాను.

"మా కులపోల్లలో నా అంత సొగసైన పిల్ల మరొకతి లేదయ్యా . . . నిజం . . . మావోల్లందరూ ఇదేమాట అనుకుంటారు. నేనిపుడు 'వూ' అనాలే కానీ నన్ను మనువాట్టానికి శానామంది కుర్రోల్లు తయారుగా ఉన్నారు. నాకెవరూ వొద్దయ్యా నాకు ఆడంటేనే ఇష్టం. ఆడు వొత్తాడు. తప్పకుండా వొత్తాడు. నన్ను, పిల్లల్ని వొదిలి ఆడుండలేడు. నేనాడి కోసం ఎదురు సూస్తానయ్యా" అంది.

నాకు హైద్రాబాద్‌కి బదిలీ అయ్యింది. కన్నీళ్ళు పెట్టుకుంటున్న మల్లిని బుజ్జగించి – నా స్థానంలో వచ్చి చేరినతనికి మల్లిని పరిచయం చేసి. – విజయవాడ పనిమీద వచ్చినపుడల్లా తనను వచ్చి చూస్తానని మాటిచ్చి బయల్దేరాను.

ఓరోజు ఓబులేశు నుంచి ఉత్తరం వచ్చింది. మల్లికి మగపిల్లాడట. తల్లీ పిల్లాడు క్షేమంగా ఉన్నారని, మల్లి నన్ను తల్చుకోని క్షణం లేదని రాశాడు. మల్లి కోరుకున్నట్లే ఆమెకు మగపిల్లాడు పుట్టినందుకు సంతోషించినా, మల్లి ఎవరికోసమైతే మగపిల్లాడు కావాలనుకుందో అతనే దూరమైనందుకు బాధపడ్డాను.

ఉత్తరం అందుకున్న మూడు వారాలకు విజయవాడ వెళ్ళే పని పడింది. ఓబులేశుకి నేనొస్తున్నట్లు కబురు పంపాను. విజయవాడలో నా ఆఫీసు పనులన్నీ ముగించుకున్నాక ఓబులేశుతో పాటు మల్లిని చూడ్డానికెళ్ళాను.

మనిషి బాగా చిక్కింది. నన్ను చూడగానే వెల్లువెత్తిన ఉత్సాహంతో దగ్గర కొచ్చింది. ఆమె మొహంలో అద్భుతమైన వెలుగు . . . నన్ను చూసినందుకనుకున్నాను. కాదు. ఆమె భర్త ఆచూకీ తెల్సిందట – అందుకు.

"ఆడెక్కడున్నాడో తెల్సా అయ్యా. మీ వూల్లోనే . . . ఐదరాబాదులో . . . మా వోల్లంతా పిచ్చోల్లలా ఇశాకపట్నం, ఇజీనగరం, సికాకులం ఎతుకుతా ఉంటే ఆడు కుసాల్‌గా ఐదరాబాదులో

ఉన్నాడట. మీది శానా పెద్దూరట కదా. ఆడ్ని ఎతికి పట్రాడానికి మా అయ్య పోయాడు. నేను సెప్పాకదా. ఆడొత్తాడనీ" అంది. గుడిశెలో మల్లితోపాటు ఇపుడు ఇద్దరు పిల్లలున్నారు. మల్లి చేతిలో కొద్దిగా డబ్బులుంచి తిరుగు ప్రయాణమైనా. వచ్చేముందు మల్లి, "ఆడు రాంగానే ఓబులేశు బాబాయికి సెప్పి మీకు కారుడు రాయిత్తా" అంది.

హైద్రాబాద్ తిరిగొచ్చిన నెల రోజులకు ఓబులేశు నించి ఉత్తరం వచ్చింది. ఎన్ని రోజులు వెతికినా మల్లి మొగుడు దొరకలేదనీ – కానీ అక్కడే ఉన్నాడని మాత్రం రూఢిగా తెల్సిందనీ – మల్లి చాలా దిగులు పెట్టుకుందనీ – ఆరోగ్యం కూడా బావుండటం లేదనీ దాని సారాంశం.

మల్లిని తల్చుకుంటే బాధనిపించింది. పిచ్చి పిల్ల . . . అతను దొరికితే బావుండు . . . మల్లి కళ్ళలో మరలా వెలుగొస్తుంది . . . అతనెక్కడున్నా తనకు దూరంగా, తననొదిలి ఉండలేడన్న మల్లి నమ్మకం బతకాలన్న కోరిక నాలో . . .

ఓరోజు పనుండి హయత్‌నగర్ వెళ్ళాను. తిరిగొచ్చేప్పుడు ఇడ్లీ, దోశెలు అమ్ముతున్న బండి దగ్గర ప్లేట్లు కడుగుతూ కన్పించాడు. అతనా కాదా అని అనుమానమొచ్చి మరలా పరిశీలనగా చూశాను. అతనే . . . మల్లి భర్త . . . గడ్డం మాసిపోయి – కళ్ళు లోతుకు పోయి దీనంగా ఉన్నాడు. నన్ను చూస్తే మరలా గుబారం మార్చేస్తాడనుకుని, అతనికి కన్పించకుండా జాగ్రత్తపడి వచ్చేశాను.

ఓబులేశుకు ఉత్తరం రాయడానికి కూచున్నాను. దివ్యంగా వెలుగుతున్న మల్లి మొహం కన్పించింది. మల్లి చాలా సంతోష పడ్తుంది. మొగుణ్ణి పట్టివ్వటంలో నా వంతు సహకారం ఉన్నందుకు మరీ ఆనందపడ్తుందనిపించింది. ఆ వెంటనే నా కళ్ళ ముందు మరో చిత్రం మెదిలింది. గుడిశెలో దీనంగా మల్లి– ఆమె చుట్టూ చేరి ఆకలంటూ ఏడుస్తున్న ముగ్గురు పిల్లలు – ఏ మద్రాసుకో పారిపోయిన ఆమె భర్త... మరలా అతనికోసం వెతుకులాట . . . అంతా వలయంలా కన్పించి భయమేసింది. ఉత్తరాన్ని చింపేశాను.

ఆమె భర్త కన్పించినా తెలియబర్చనందుకు మల్లి నన్ను క్షమిస్తుందో లేదో వాకు తెలియదు గాని అతని ఆచూకి తెల్పితే నన్ను నేను క్షమించుకోలేననిపించింది.

*(రచన ఇంటింటి పత్రిక - ఫిబ్రవరి, 2003)*